# వెలుతురు పూలు

"ఏవిట్రా... డాన్స్ చేస్తున్నావా లేక సిగమూగుతున్నావా! ఏమిటా కప్పగంతులు!"

నటరాజ కళాక్షేత్రము చిన్నారి బాలలు రంగుల పూవుల్లా తలలూపుతూ డాన్స్ నేర్చుకుంటున్నారు. డాన్స్ మాస్టారు దృష్టి నాగరాజు మీద పడింది. 'వంతుకు దాసరి కాలును వంకర ఆడించె' నన్నట్టు చూస్తూ కాళ్లూ చేతులాడిస్తున్న నాగరాజును పక్కకు లాగి పిలిచి మంద్రస్వరంతో మందలించిండు. మిగతా పిల్లల డాన్స్ ప్రాక్టీసు యథావిధిగా సాగిపోతోంది.

పాలబుగ్గల పసిబాలల నాట్యవిలాసం నయనానందకరంగా ఉంది. పదేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైందా బ్యాచు. కర్ణపేయమైన నట్టువాంగం చిన్నారి చేతుల్ని, లేత కాళ్లను లయబద్ధంగా కదిలిస్తూంది. అందెల రవళి అలరిస్తూంది.

"రోజూ అందరికంటే ముందుండేవాడివి, ఈ రోజు నీకేమైందిరా?" ఆప్యాయంగా వీపు నిమిరిండు. అతని నుదిటిమీద అల్లిబిల్లిగా అల్లుకుపోతున్న అనుభవ రేఖలు నాగరాజు నాశ్చర్యపరిచినై.

"తలనొప్పిగా ఉంది మాస్టారూ!"

"అట్లానా... అయితే పక్కన కూచో"

అలవోకగా అబద్ధం చెప్పేసి పక్కన కూచున్న నాగరాజు మనోనేత్రా వాల్లింటి ముందున్న హోటల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న బాలకార్మికుడు ఐలయ్య చుట్టూ తిరగుతున్నై. వాడూ తన వయసువాడే.

పసందైన రుచుల్ని పైసల్లోకి మార్చుకుంటున్న ఆ 'హోటల్ భారత్' ఎప్పుడూ కిటకిటలాడ్తుంది. శుచీ శుభ్రతకు కొదవలేదు. పాపం! పాలబుగ్గల ఐలయ్య పొద్దుట్నుంచి రాత్రిదాకా యంత్రంలాగా పంజేస్తుంటాడు. ఏం తింటాడో, ఎప్పుడు పడుకుంటాడో కాని.... యజమాని వడ్డించిన లెంపకాయలు రోజుకు కొన్నిసార్లు తింటుంటాడు. చిట్టి చేతుల్లోంచి పొట్టి కప్పు జారిపడితే పిడిగుద్దులు, తుడిచే గుడ్డ పొరపాటున ఎవరికన్నా తాకితే చెంపల వాయిద్యం... బుగ్గలు కందిపోయి గోగుపూలైపోతాయి. మణిదీపాల్లాంటి కళ్లను నీటిపొరలు కమ్ముకుంటై...

"అమ్మా...అమ్మా." అని అరుస్తుంటే గుండెలవిసి పోతాయి. లోపల వాని మొర వినే నాథుడే లేడు. ఎంగిలి గిన్నె లెత్తడం ఆలస్యమైతే

"కండ్లకు కాపురమొచ్చింరా ముండాకొడకా! నీయమ్మన్...." సప్లయర్ బూతుపం చాంగం విప్పుతాడు. పేడలో పురుగులా తోసి పారేస్తాడు.

ఐలయ్యకు అమ్మానాన్నలు లేరట. దూరబ్బంధువెవరో హోటల్ కప్పజెప్పి ఆర్నెల్ల జీతం అడ్వాన్స్‌గా తీసుకుపోయిండట. ఇంకో ఆర్నెల్ల జీతం యజమాని దగ్గరే ఉందట. తన ఇంటికెదురుగా, ఉన్న హోటల్, వెనక భాగములో కన్పించి చెప్పిండోసారి. వాడు

అమ్మా అని అరుస్తుంటే కడుపులో కలెబెట్టినట్టవుతుంది. నాలాగా వాడు గూడా యూనిఫారం వేసుకుని బడికొస్తే ఎంత బావుంటుందో.

"పద...పోదాం! డాన్స్ క్లాసైపోయింది" పక్కింటి నరేశ్ భుజం పట్టి కుదిపిండు.

నాగరాజు, నరేశ్... మరికొందరు పిల్లల ఇండ్లు భారత్‌నగర్‌లోని 'హోటల్ భారత్' వెనక సందులో వరుసగా ఉన్నాయి. రోజూ ఆ హోటల్ ముందే రిక్షా ఎక్కి కాన్వెంటు కెళ్తుంటారు. సాయంత్రం... పక్క వీధి గణేశ్‌నగర్‌లో ఉన్న డాన్స్ స్కూలు కెళ్తుంటారు. దగ్గరే కాబట్టి.... అది కాలినడక.

అమ్మానాన్నల చేతుల మీదుగా కరెన్సీనోట్ల కట్టలు బీరువాల్లోకి వెళ్లడం, బయటికి రావడం ఎన్నోసార్లు చూస్తుంటాడు.

పొట్టి నిక్కరు, చిల్లుల బనీను, చింపిరిజుట్టు, చెప్పుల్లేని కాళ్లు, విశ్రాంతి ఎరుగని చేతుల్తో ఐలయ్య కన్పించినప్పుడల్లా నాగరాజు నరాల్లో రోషం బుసలు కొడుతుంది. పెద్దవాళ్లంతా హోటల్ వాళ్లతో కలిసి ఐలయ్య ఉసురుబోసుకుంటున్నారని, కోపం తొంగి చూస్తుంది. వాని ఏడుపు వింటే పిడికిళ్లు బిగుసుకుపోతూ, కోపం తొంగి చూస్తుంది. వాని ఏడుపు వింటే పిడికిళ్లు బిగుసుకుపోతై, హోటల్ యజమాని పీక పిసికెయ్యాల న్పిస్తుంది.

ఐలయ్య నెవరన్నా ఆదుకుని బడికి పంపిస్తే బాగా చదువుకుంటాడు. కప్పులు జారిపడవు. తన్నులుండవు. హాయిగా నవ్వుతూ తనతో ఆడుకుంటాడు. డాన్స్ క్లాసులో తమతో కాళ్లూ చేతులు కలుపుతాడు... నాగరాజుకు అన సయించట్లేదు.

"ఏందిరా... గట్ల ప్లేట్ల గెలుకుతున్నవ్! తింటున్నది అన్నమా, సున్నమా?" నాన్న అడిగిండు - పెరుగన్నం తింటూ. అప్పుడు గుర్తుకొచ్చింది... తాను డైనింగ్ టేబుల్ ముందున్నాని. నియాన్ లైట్లు.. ఎప్పట్లాగే వెలుగులు విరజిమ్ముతూన్నై. ఆ వెలుతురు పొరల్లో అమ్మానాన్నలు అదోలా కనిపిస్తున్నారు.

అరెరే! అక్కా, తమ్ముడు, అమ్మానాన్నల భోజనమైపోయిందే! వాళ్ల ముచ్చట్లేవి వినబడలేదే! రాత్రి పదైంది.

"ఏంది బిడ్డా.. గట్లున్నవేందిరా?" అమ్మ గొంతులోంచి గాబరా, గారాబం కలెగలుపుకొచ్చినై.

ఏం చెప్పాలి? ఎట్లా చెప్పాలి?... కాని... చెప్పి తీరాలి.

"అమ్మా! గా హోటల్ల ఐలయ్య అనే గరీబు పిల్లగాడున్నడే"

"ఐలయ్య ఒక్కడే కాదు. అసొంటి పనోళ్లు మస్తుగున్నరు... ఆc.. ఉంటె ఏందటా?"

"పాపం... ఐలయ్య చిన్నపిల్లగాడు...."

"నువు పెద్ద పిల్లగానివా?"

"కాదు...కాని, వాణ్ణి రోజూ కొడుతున్నరు, తిడ్తున్నరు. వాడు ఏడుస్తున్నడు నాన్నా!" మాటల్లో జాలి జాలువారుతూంది.

"ముప్పూటలా మేస్తున్న జీతగాడు పంజెయ్యకుంటె ముద్దు పెట్టుకుంటారారా? కూకుండ వెట్టి కూడువెడ్తరా?"

"అది కాదు నాన్నా! వానికి అమ్మానాన్నలు లేరటా. చిన్న పిల్లగాడు. పెద్ద పెద్ద టేబుళ్లు.. గంటల కొద్ది నిల్చుండి తుడవాలంటా... పాపం"

"కావచ్చు. అయితే... మనకేందీ?" నాన్న గొంతులో గాంభీర్యం.

గబగబా తినేసిండు. ఓ వైపు భయం, మరోవైపు మానవత్వం... "వానికి చదువుకోవాలని ఉందటా, నాతోని చెప్పిండు...." చేతులు కడుక్కుంటూ అమ్మవైపు చూస్తున్నాడు.

"ఉంటే... ఉండొచ్చు. గా సంగతి మన కెందుకు నానా?" అమ్మ గొంతులోని ఆప్యాయత కల్తీపాలలాగున్నది. ఆమె డైనింగ్ టేబుల్ సర్దేసి హాల్లోకి నడిచింది. తానూ అనుసరించిండు. నాన్న అప్పటికే అక్కడికొచ్చిండు. అక్కా తమ్ముడు మంచాల మీద పడుకున్నారు.

"పాపం ఐలయ్యా...బడికి పోతే బాగుంటది నాన్నా!"

"అబ్బబ్బా.... వాడు బడికి పోతే వద్దన్నమా, బండిగొడితే వద్దన్నమా? గదంతా మనకెందుకూ?"

"అది కాదు నాన్నా... అమ్మనాన్నలు లేనోడు, అసలూ... వానికెవ్వరూ దిక్కులేరు...."

"దిక్కులేనోళ్లకు దేవుడే దిక్కురా!"

"మనకు మస్తుగ డబ్బుంది గదా!"

"ఉంటే... పంచి పెడ్తమా, పారేస్తమా?"

"వాణ్ని మనింట్ల ఉంచుకుని చదివిస్తే...."

"నోర్మూయ్! జానెడంత లేవు... మూరెడంత మాటలా? దాన కర్ణునినై పోతున్నావ్ బే..." డ్రెస్ మార్చుకుంటున్న నాన్న మొహం డేంజర్ బల్బులాగుంది.

"మాతో పాటు వాడుంటడు. మాతోని బడికొస్తడు. పెట్టింది తింటడు...పాపం... మనకే పుణ్యం ... కదమ్మా"

"పోరా వెర్రినాగన్నా!" అమ్మ అదోలా నవ్వింది. "లోకమ్మీద గతిలేనోళ్లు బోలెడున్నరు వాళ్లందర్నీ ఆదుకోవడం... మన తరమా! నువ్వు అన్నంకూడా సరిగా తినలేదు. పిచ్చి పిచ్చి ఆలోచనలు బంద్‌జేసి హాయిగా పడుకో పో...."

ఐలయ్య దీనవదనం నాగరాజు కళ్లల్లో కదలాడింది.

"అందర్నీ కాదే... ఒక్క ఐలయ్యనే...."

"ఏందిరో... మావోడు మంచోడంటే మంచమెక్కి ఆడిండట ఎవడో" నాన్నలో విసుగు విసురు. "బుద్ధిగా చదువుకొమ్మని బడికి పంపిస్తే....గా గాడిది బుద్ధులు నీకెందుకురా? నీ చదువు నువు చూస్కో! పదేండ్ల పోరనివి. పెద్ద పెద్ద మాటలు.."

"ప్లీజ్ నాన్నా...." దుఃఖమొస్తూంది.

"అరేయ్!" పళ్లు పటపటలాడినై. "ఆ దరిద్రుని గురించి ఇంకేమన్నా మాట్లాడ్తే.... వీపు సాపైపోతది... జాగ్రత" గుడ్లురిమి పడగ్గదిల దూరిపోయిండు.

నాగరాజులో ఉక్రోషం ఉరుకులాడ్తుంది. గుండెలెగిరిపడుతున్నై. ఎంత ప్రయత్నించినా మనసు తెరమీంచి ఐలయ్య రూపం చెదిరి పోవట్లేదు. వాడు... బడికి పోవాలె.. నాతోని అడుకోవాలె... ఎట్లా... ఎట్లా.... కడుపులోని కల్లోలం కంటి బిందువులై బయటికొచ్చి చెంపల్ని తడిపేస్తూంది.

"అరెరే...!" కొంగుకు చేతులు తుడుచుకుంటున్న అమ్మ హడిలిపోయింది. గబాలున ఒడిలోకి లాక్కుంది. "గీ మాత్రానికే ఏడుస్తరా? ఛ ఛా... కావాలంటే ఓ ఐదో పదో రూపాయలు నేనిస్తా. ఆ పోరనికిచ్చెయ్. గాలికి పోయే కంపను వేలుకు తగిలించుకున్నట్లు వాని సంగతి మనకెందుకు నాన్నా!" కొంగుతో కళ్లు అద్ది, నుదురు ముద్దాడింది. "నువ్వు మంచిగ చదువుకో, డాన్స్ నేర్చుకో, ఇంకేదన్నా మంచి విద్య నేర్చుకో, ఫీజు ఎంతైనా ఫరవాలేదు. నువు పెద్దబెరిగి మీనాన్న లెక్క బాగా సంపాదించాలె.." ఇంకేదేదో చెబుతూ జోకొట్టింది. అమ్మ ఒడి హాయిగా ఉంది. ఆ హాయి నిద్రకు ఒురు పంపింది.

.....ఖాలీ కప్పులు పట్టుకెళ్తున్న ఐలయ్య జారిపడిపోయిండు. కప్‌సాసర్లు ముక్కలై చెల్లాచెదరైపోయినై. యజమాని పరుగెత్తుకొచ్చిండు. ఆ ముక్కలన్నీ కాళ్లల్లో, కళ్లల్లో గుచ్చుకున్నట్టు రెచ్చిపోయిండు. ఐలయ్య రెక్కబట్టి లేపి లెంపలు వాయించిండు. వీపు విమానం మోత మోగింది. గట్టిగా డొక్కలో గుద్దిండు.... అంగలారుస్తూ చిన్నారి ఐలయ్య పడిపోయిండు. కాళ్లూ చేతులు కొట్టుకుని చచ్చిపోయిండు. వానికోసం ఏడ్చేవాళ్లెవ్వరూ లేరు. శవం కాళ్లూ చేతులు కట్టేసి మున్సిపాల్టీవాళ్లు లాక్కెల్తున్నారు...

"అమ్మా....! ఐలయ్యా...!" ఇల్లు దద్దరిల్లింది.... పొత్తి కడుపులోంచి వచ్చిన పొలికేక అమ్మానాన్నల నదరగొట్టింది. అమ్మ ఒడిలోకి తీసుకుంది.

"ఏమైంది... ఏమైందిరా?" వీపు నిమిరింది. అంతా చెప్పేసిండు.

"వాని గురించే ఆలోచిస్తుంటే గట్లే కలలు వస్తుంటయ్. అంతా మరచిపో. నాన్నా.... హాయిగా బజ్జో...." జొకొట్టింది. నాగరాజు కళ్లు మూతలు పడినై. నిద్ర... కలత నిద్ర.. ఐలయ్య బెడికెళ్తున్నాడు... తనతో ఆడుకుంటున్నాడు... వానిమొహం చందమామలా వెలిగిపోతూంది... అంతే తెల్లవారింది. భళ్లున తెల్లవారింది.

"పిల్లలూ... లేవండి... చదువుకోండి" నాన్న పిలుపు.



కథా నిలయం శ్రీకాకుళం

****

హోటల్ భారత్.... ఓ జనారణ్యం. అది ఐలయ్య పాలిట కీకారణ్యం. వాడు... ఏకాకి.

ఎప్పట్లాగే జనాలు వచ్చిపోతున్నారు. రోజుట్లాగే హోటల్ ముందు స్కూల్ రిక్షా నిలబడింది. కలుగులోంచి ఎలుకపిల్లల్లా... బడిపిల్లలు ఇళ్లల్లోంచి బయటికొస్తున్నారు. ఐలయ్య చూపులు రిక్షా మీదున్నై. నాగరాజు, నరేశ్‌తో సహా రిక్షా పిల్లలంతా వాణ్నే చూస్తున్నారు.

"ఏం జూస్తున్నావ్‌రా బాడ్కావ్...." ఐలయ్యను రెక్క బట్టి లాక్కెల్తున్నాడో సప్లయర్.

రిక్షా కదిలింది. నాగరాజు మనసు చివుక్కుమంది.

"పాపం! ఐలయ్యకు అమ్మానాన్నలు లేరట్రా" నాగరాజు గొంతు వణికింది.

"అవునట్రా! వానికేమో చదువుకోవాలనుందటా. మొన్న నాతో చెప్పిండురా" నరేశ్ గొంతులో బాధ.

"ఏదన్నా చేద్దాంరా, వాణ్ని కూడా బడికి దీస్కపోదాంరా" మరో పిల్లాడి ఆరాటం.

పసిపిల్లల ఆలోచనలు రిక్షా పరుగులతో పోటీ పడుతున్నై. నాగరాజు నాన్న వైఖరి అందరి ముందు పరుచుకుంది. నిరాశా నిస్పృహలు అలుముకుంటున్నై.

"మానాన్న నడిగినా గంతే....'

"నా...పనీ గంతే... మానాన్న జగమొండి..."

"ఛీఛీ... మన నాన్నల కసలు బుద్ది లేదురా..."

"ఏదన్నా ఉపాయం తియ్యండ్రిరా.. లేకపోతే నాకు ఏడుపొస్తుందిరా..." తర్జన భర్జనలు తారాస్థాయికి చేరుకున్నై. తిరిగి ఇంటికొచ్చేప్పుడు గూడా అదే విషయం తీగలు సాగింది.

హోటల్ భారత్ ముందు రిక్షా దిగుతున్నారు. అందరి దృష్టి అటే...

ఐలయ్య బుల్లి చేతులు... యాంత్రికంగా టేబుల్ తుడుస్తున్నై. తుడిచే గుడ్డ చేజారింది. కింద పడుతూ టిప్‌టాప్‌గా టక్ జేసుకుని టిఫిన్ చేస్తున్న జంటిల్‌మెన్ కాలివేలుకు తాకింది.

"అరేయ్ లంజాకొడకా! టేబుల్ తుడుస్తున్నావా, తమాషా చూస్తున్నావా..." జంటిల్‌మెన్‌కు ఒళ్లు మండింది.

"అయ్యా నీ బాంచెన్.. చూల్లేదయ్యా..." అటూ ఇటూ చూస్తూ గబుక్కున గుడ్డ అందుకున్నాడు.

"గటు జూస్కుంట గిటు తుడుస్తుంటే గట్లే ఐతదిరా బాడ్కావ్" సప్లయర్ మొరటు వేళ్లు ఐలయ్య చెంప గిల్లినై. కాదు... పిండేసినై.

"అమ్మా...." ఆర్తనాదం.

అంతా చూస్తున్న లేతగుండెలకు గుండుసూది గుచ్చుకుంది.

డాన్స్‌క్లాస్ ప్రారంభమైంది. కాళ్లూ చేతులు లయబద్ధంగా తిప్పుతూ పిల్లలు జింకపిల్లల్లా కదులుతున్నారు. కాని వాళ్ల మొహాలు పాలిపోయినై. కారణం అడిగిండు మాస్టారు. అంతా చేప్పేశారు.

విధిలేక పనుల్లోకి దిగిన బాలల బంగారు భవిష్యత్తు ప్రశ్నార్థకమైపోతుందని మాస్టారుకు తెలుసు.

కమ్మని రుచుల్ని పంచే హోటల్ భారత్‌లోనే మాస్టారు రోజూ టిఫిన్ చేస్తుంటారు ఎన్నో పుస్తకాలు పేజీలు తిప్పాల్సిన సున్నితమైన చేతులు ఎంగిలి ప్లేట్లు, గ్లాసులు ఎత్తడం పాఠాలు వినాల్సిన దెబ్బలు దినడం... మనసును కలిచివేసింది. కాని.... తానో నిస్సహాయుడినని సరిపెట్టుకోక తప్పలేదు. ఇప్పుడు గుండె నరాలను మెలిపెట్టినట్లైంది.

"నిజమే... పాపం!" పొడుగాటి నిట్టూర్పు వెలువడింది. "దానికి మీరేం చేస్తార్రా"

"ఐలయ్య బడికి పోవాలె మాస్టారు!"

"కాని.... ఎట్లారా? మీ నాన్నలు ఖరీదైన మనుషులు. వాళ్లకు సంపాదన గురించి తెల్సినంతగా సమాజం తెలియదు. మీరా విషయాన్ని పక్కన పెట్టి డాన్స్ నేర్చుకోండి"

"మేము డాన్స్ నేర్చుకోకపోతే... సమాజానికేమన్నా నష్టమా మాస్టారూ?" నరేశ్ ప్రశ్న మాస్టారు నుక్కిరిబిక్కిరి చేసింది.

"అం...టే...." నీళ్లు నమిలిండో నిముషం. "నీ ఉద్దేశ్యమేమిట్రా?"

"మా డాన్స్ ఫీజులు ఐలయ్య కిస్తే..."

వీళ్లు పిల్లలా... పుణ్యమూర్తులా! మాస్టారు అంతరంగ రంగస్థలమ్మీద మానవత్వం గజ్జెకట్టింది. నరాలు పరోపకారం పల్లవితో కొత్త స్వరాలు వినిపించినై.

బాగానే ఉంటుంది కానీ, ఆ సంగతి వీళ్ల తల్లిదండ్రులకు తెలిసిపోతుంది కొండనాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు వీళ్లు డాన్స్ మానేస్తే వాళ్లు ఫీజులివ్వరు. నా నోట్లో దుమ్ము పడుతుంది. ఇది తప్ప వేరే అదాయము లేదాయె.

"ఊహుఁ! ఆ ఐడియా బాగాలేదురా." ఫలితాలు వివరించిండు. పిల్లలు బుర్ర గోక్కున్నారు.

"ఆఁ... మాస్టారూ!" నాగరాజు బుర్రలో కొత్త బల్బు వెలిగింది. "మీరు డాన్స్ ఫీజులు పెంచేస్తున్నారు. పెరిగిన ఫీజులు ఊలయ్యకిస్తున్నారు..."

నిజమే... ఈ సిద్ధిపేట పట్టణం నేడు కళాకాంతులు విరజిమ్ముతూంది. ఈ టౌనులో నేను తప్ప మరో డాన్స్ మాస్టారు లేదు. ఫీజులెంత పెంచినా తల్లిదండ్రులు వెనుకాడరు.

"ఇది... బాగానే ఉందిగానీ... అది వాని తిండి, బట్టలకు సరిపోతుందా?"

"సరిపోదా మాస్టారూ!" నాగరాజు పట్టుదల

"ఐతే.... నేను నా పాకెట్ డబ్బులిచ్చేస్తా...." నరేశ్ ఉత్సాహం.

వాళ్లు పెద్దమనుషులు.. చిన్నబుద్ధులు

వీళ్లు చిన్న మనుషులు... పెద్ద బుద్ధులు...

మాస్టారు ఆనందాని కవధుల్లేవు. ఒళ్లు పులకించి, కళ్లు చెమ్మగిల్లినై.

"సరే.... ఇహ ఆ ఐలయ్య నా ఇంట్లోనే ఉంటాడురా!"

పిల్లల కళ్లు వెలుతురు పూలై పోయినై.

**14 డిసెంబరు 2002 'ఆంధ్రప్రభ'**
**వారపత్రిక**

